క్లుప్తంగా

ఆర్థిక సాయం



కామారెడ్డి అర్బన్: బాన్సువాడ మండలం తిరుమలాపూర్‌కు చెందిన దివ్యాంగుడు సంజీవ్‌కుమార్‌కు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. ప్రజావాణిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సంజీవ్‌కుమార్ సహాయం కోసం అభ్యర్థించగా కలెక్టర్ స్పందించి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్నకు విషయం తెలియజేశారు. కామారెడ్డిలో బంధువుల ఇంటివద్ద ఉన్న సంజీవ్‌కుమార్‌కు రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ఎంసీ సభ్యుడు ఎం.సంజీవరెడ్డి ద్వారా రూ.10 వేలను అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, కార్యదర్శి రఘుకుమార్, పీవీ నర్సింహం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వసతులు కల్పించాలి



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కల్పించాలని స్థానిక యువకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 30 పడకల ఆస్పత్రి ఉన్నా రోగులకు సరిపడా ఫర్నిచర్ లేదని, ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు. ఆస్పత్రిలో వసతుల కల్పనపై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టి సారించాలన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా సత్యనారాయణ రెడ్డి



పిట్లం(జుక్కల్): మండల ఇన్‌చార్జి ఎంపీవోగా వెంకట సత్యనారాయణ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిట్లం మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించిన బ్రహ్మం ఇటీవల రిటైర్ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో బాన్సువాడ ఎంపీవోగా ఉన్న వెంకట సత్యనారాయణ రెడ్డి పిట్లం మండల ఇన్‌చార్జి ఎంపీవోగా నియమితులయ్యారు. ఆయనకు జీపీ కార్యదర్శులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం రుచిగా వండాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మధ్యాహ్న భోజనం రుచికరంగా వండాలని బాణాపూర్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బుధవారం ప్రత్యేకాధికారి నరేష్ సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ శివారులోని ఉపాధి హామీ పథకం, నర్సరీని పరిశీలించారు. ఉపాధ్యాయులు, జీపీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



మాచారెడ్డి: అక్కాపూర్‌లో అభివృద్ధి పనులను బుధవారం ఎంపీటీసీ సభ్యురాలు బట్ట లత ప్రారంభించారు. గ్రామంలో హైమాస్ట్ లైటుతో పాటు బీసీ కాలనీలో బోరు మోటారును ప్రారంభించారు. బీఆర్ఎస్ నేతలు బాల్ చంద్రం, బాబు, ఎల్లయ్య, రమేష్ ఉన్నారు.

ఘనంగా మెకానిక్ డే



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ మెకానిక్ డేను ద్విచక్ర వాహన మెకానిక్‌లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌లు ద్విచక్ర వాహన సృష్టికర్త గాడ్లిబ్ డైమ్లర్‌కు నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. లింగంపేట మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాషు, ఉపాధ్యక్షులు చంద్రమౌళి, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఊర పండుగ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో బుధవారం ఊర పండుగను సంప్రదాయంగా నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అలరించాయి. నాలుగు రోజుల పాటు ఊర పండుగలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా జరుపుకున్నారు. గ్రామ పెద్దలు రమేష్‌యాదవ్, మాలీస్ వెంకటేశం, రాజు, తదితరులున్నారు.



టేక్రియాల్ కస్తూర్బా పాఠశాలలో..



గాంధారి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ..



సదాశివనగర్‌లో..

సైబర్ నేరాలపై అవగాహన



బీర్కూర్‌లో ..



ఎల్లారెడ్డి జెడ్పీబాలుర పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేష్

సాక్షి నెట్‌వర్క్ : సైబర్ జాగృతి దివస్ సందర్భంగా సైబర్ నేరాలపై జిల్లాలో పలు పాఠశాలలతో పాటు గ్రామాలలో పోలీసులు కళా బృందం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ తదితర సోషల్ మీడియా యాప్‌లను వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణులయ్యే వరకు సెల్‌ఫోన్లు వాడొద్దని విద్యార్థులకు సూచించారు. సెల్‌ఫోన్ల వాడకంతో సమయం వృధా అవుతుందని, చక్కగా చదువుకోవాలని సూచించారు. ఎవరివల్ల నైనా ఇబ్బందులుంటే నేరుగా గాని, పాఠశాల ఉపాధ్యాయుల ద్వారా గాని పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ నెంబర్‌లు అడిగితే చెప్పవద్దన్నారు. అనవసరపు లింకులు ఓపెన్ చేయకూడదన్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ కస్తూర్బా పాఠశాల, గాంధారి మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాల, ఎల్లారెడ్డిలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే బీర్కూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల బీర్కూర్ కామప్ప చౌరస్తా వద్ద, పిట్లం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు.



పిట్లంలో ..

నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక



గంగన్నగారి బృంద



మహమ్మద్ సాదియా



మెటాటి స్నేహ



జనగామ స్ఫూర్తి

రాజంపేట: తలమడ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గంగన్నగారి బృంద, మహమ్మద్ సాదియా, మెటాటి స్నేహ, జనగామ స్ఫూర్తి లు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు దొమ్మాటి భిక్షపతి తెలిపారు. తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థుల ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శుభాంకాంక్షలు తెలిపారు.

జంగంపల్లి విద్యార్థిని..

భిక్కనూరు: జంగంపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్‌కే సనా ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. సనా బాసరలో సీటు లభించింది. పదవ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించింది. సనా ట్రిపుల్ ఐటీకి ఎంపికవడంతో హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుడు గఫూర్ అభినందించారు.

మోడల్ స్కూల్ నుంచి 25 మంది..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 25 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..ఒకే పాఠశాల నుంచి 25 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.

లీకైన మిషన్ భగీరథ పైపులైన్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): చందాపూర్‌లో లీక్ అవుతున్న మిషన్ భగీరథ పైపులైన్‌లకు బుధవారం మరమ్మతులు చేశారు. బుధవారం సాక్షి పేపరులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో సాజిద్ అలీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్, గ్రామ కార్యదర్శి నవాజ్ గ్రామానికి వెళ్లి పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. మరమ్మతులు చేయిస్తున్నారు. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న పైపులైన్ లీకేజీ పనులు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

భిక్కనూరు/ఎల్లారెడ్డి/లింగంపేట(ఎల్లారెడ్డి): దేశ వ్యాప్తంగా గురువారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీయొద్దిన్, పీపడీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఎస్ఎస్‌యూఐ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు వేర్వేరుగా పిలుపునిచ్చారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై తక్షణమే విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో జరుగుతున్న నిలువు దోపిడీని వెంటనే అరికట్టాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష



నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి దయానంద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే సానిటేషన్ పనులు, ఉపాధి హామీ పనులపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ప్రతి గ్రామంలో త్రాగు నీరు సరఫరా చేయాలని, వర్షాకాలం పైపు లైన్ లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఎంపీపీ పాల్త్య విఠల్, ఎంపీడీవో నీలావతి, ఎంపీవో రాము, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఏడీఏ వీరాస్వామి సూచించారు. నాగిరెడ్డిపేట వ్యవసాయ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పంటల నమోదు ప్రక్రియను ప్రారంభించి ఆగస్టు నెలాఖరు వరకు పూర్తి చేయాలని చెప్పారు. ఏవో విజయశేఖర్, ఏఈవో నిఖిత, దివ్య ఉన్నారు.

తై బజార్ వేలం పాట

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి పంచాయతీ పరిధి తైబజార్‌ను జీపీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వేలం వేసినట్లు జీపీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. తొమ్మిది నెలల కోసం తై బజార్‌ను రూ.4.81లక్షలకు వేలం పాట వేసినట్లు వెల్లడించారు. ఐదుగురు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారని తెలిపారు. తూర్పు సంతోష్ కుమార్ రూ.4.51 లక్షలకు వేలం పాట పాడి తైబజార్‌ను దక్కించుకున్నట్లు కార్యదర్శి తెలిపారు.

లింగంపేట తైబజార్..

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట గ్రామ పంచాయితీ తైబజార్ వేలం పాటను ప్రత్యేకాధికారి నరేష్ సమక్షంలో గ్రామ పంచాయతీ అధికారులు బుధవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన హర్షద్ పాష రూ.4.85 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. కార్యదర్శి శ్రవణ్‌కుమార్, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



గాంధారి జీపీలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నేడు గోపాల్‌పేట తైబజార్‌కు వేలం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట గ్రామపంచాయతీ కార్యాలయంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి తైబజార్ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.50 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని చెప్పారు. తైబజార్ కనీస ధర రూ.3లక్షల90వేల225గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

సమాచారం..

గెస్ట్‌లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట ఆదర్శ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా విధులు నిర్వహించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. కళాశాలలో అతిథి అధ్యాపకులుగా అర్థశాస్త్రము, ఇంగ్లిష్ బోధించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె చెప్పారు. సంబంధిత సబ్జెక్టులతో పీజీ, బీఈడీ చేసినవారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8లోపు తమ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

బిచ్కుంద(జుక్కల్): పంటల పెట్టుబడి కోసం ప్రభుత్వం సహాయం అందిస్తామని ప్రకటించడంతో క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. బుధవారం బిచ్కుంద, పుల్కల్ సొసైటీలలో రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారులు వెంకట్‌రెడ్డి, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కొనసాగింది. పది ఎకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. అలాగే అసైన్‌మెంట్ భూమిలో పంటలు సాగుచేస్తున్న రైతులకు కూడా ఇవ్వాలని రైతులు కోరారు. సొసైటీ చైర్మన్లు ఏడీఏ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణకి రైతులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఏడీఏ లక్ష్మీ ప్రసన్న, ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



బాన్సువాడ సొసైటీలో మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణారెడ్డి

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం సహకార సంఘ సభ్యులు, రైతులతో జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి, ప్రత్యేక అధికారి రామ్మోహన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పథకం అమలుపై రైతులు, సహకార సంఘాల సభ్యుల నుంచి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నారు. కార్యదర్శి బాబూరావ్, సొసైటీ డైరెక్టర్లు, రైతులున్నారు.



పుల్కల్‌లో రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్న అధికారులు

రైతుల అభిప్రాయాలు తీసుకోవడం అభినందనీయం

బాన్సువాడ: రైతు బంధు, రైతు బీమాపై రైతుల అభిప్రాయాలు సేకరించడం హర్షణీయమని బాన్సువాడ సహకార సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం బాన్సువాడ సహకార సంఘంలో రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తీర్మానించిన అంశాలను చదివి వినిపించారు. 10 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు రైతు బంధు వర్తించేలా చూడాలని, 59 ఏళ్లు ఉన్న రైతు బీమా వయోపరిమితిని 61 ఏళ్లకు పెంచాలని, కౌలు రైతులకు రైతు బంధు వర్తించేలా చూడాలని అన్నారు. జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి, ఏడీఏ అనీల్ తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ వేళ జవాన్‌కు ఘన స్వాగతం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ బర్సల్ అమర్ సింగ్ బుధవారం ఉద్యోగ పదవీ విరమణ చేసి సొంత గ్రామానికి చేరుకున్న సందర్భంగా ఆయనకు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం మండల కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు జై జవాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం మాట్లాడుతూ.. అమర్ సింగ్ భారత సైన్యంలో చేరి నేటికి 39 సంవత్సరాలు అయిందని, ఇన్ని సంవత్సరాలు దేశానికి సేవ చేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామస్తులు అమర్ సింగ్ దంపతులకు శాలువా పులమాలతో సత్కరించారు.



స్వాగతం పలుకుతున్న పెద్దకొడప్‌గల్ గ్రామస్తులు

ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోవాలని నోటీసులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం గోపాల్‌పేటలో వ్యాపారస్తులు 2024–25 సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని పేర్కొంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య బుధవారం పలువురు దుకాణదారులను నోటీసులను అందజేశారు. ట్రేడ్ లైసెన్స్‌ల కోసం దుకాణదారులు పూర్తి వివరాలతో మీ–సేవాకేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మీ–సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తాను అప్రూవ్ చేస్తానని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్‌లు పొందని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం ప్రమాణస్వీకారం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా కొరుపల మహేందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పాక నారాయణ, కార్యదర్శిగా కొరుపల సురేష్, డైరెక్టర్లుగా కాచాపురం ఎల్లయ్య, దువ్వల సత్యప్రకాష్, పంపరి విష్ణుప్రసాద్, లాలి రాజు, దువ్వల శ్రీనివాస్, దువ్వల రవికాంత్‌లు ఎన్నికయ్యారు. బుధవారం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు జి.సత్యనారాయణ, దువ్వల నారాయణ, జి.లక్ష్మీనారాయణ, డి.నర్సయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప, అన్నప్రసాద సేవా సమితుల కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అయ్యప్పస్వామి దేవాలయానికి సంబంధించి బుధవారం స్వామి అయ్యప్పసేవా సమితి, అయ్యప్ప అన్న ప్రసాద సేవా సమితి ఎన్నికలు నిర్వహించగా కార్యవర్గసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్వామి అయ్యప్పసేవా సమితి అధ్యక్షుడిగా గందె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీనివాస్, కోశాధికారిగా సోమిశెట్టి నారాయణలు ఎన్నికయ్యారు. అయ్యప్ప అన్నదాన ప్రసాద సేవా సమితి అధ్యక్షుడిగా విశ్వనాథుల రాజేందర్, కార్యదర్శిగా బాస రఘుకుమార్, కోశాధికారిగా మోటుకూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన సభ్యులకు ఎన్నికల అధికారి కైలాస్ శ్రీనివాస్‌రావు, శనిశెట్టి గౌరీ శంకర్‌లు ధ్రువపత్రాలు అందజేసి సన్మానం చేశారు.



కొత్తగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు

ఎంపీటీసీలకు ఘనంగా వీడ్కోలు



గాంధారిలో..



ఎంపీపీ పట్లోళ్ల జ్యోతిదుర్గారెడ్డి దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు



నిజాంసాగర్‌లో..



నాగిరెడ్డిపేటలో .. జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి



తాడ్వాయిలో..



దోమకొండలో..

సాక్షి నెట్‌వర్క్: మండల పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం బుధవారం ముగియడంతో ఎంపీపీ, వైస్ ఎంపీపీలతో పాటు ఎంపీటీసీ సభ్యులను అధికారులు సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించి శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ..ప్రజా సేవకు పదవీ విరమణ ఉండదని, పదవి లేకున్నా ప్రజా సేవలో ముందుండాలని వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవచేసే వారిని పార్టీలకు అతీతంగా ప్రజలు ఎన్నుకోవాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఉంటే అభివృద్ధి సాధ్యమన్నారు.



రాజంపేట: శివాయిపల్లి ఎంపీటీసీ బాల్‌రాజ్‌కు..



సదాశివనగర్‌లో..



కామారెడ్డిలో..



దేశాయిపేట్ ఎంపీటీసీ రమణకు సన్మానం